www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 20 జనవరి 2023



భారీ లారీల ప్రవేశాన్ని నిషేధించాలి

కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా - కలెక్టర్‌కు వినతి

కలెక్టర్‌తో చర్చిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు ఆర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలో చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలో గత కొన్ని రోజుల నుంచి యాష్ పాంట్ భారీ లారీలు తిరుగుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో భారీ లారీల ప్రవేశాన్ని నిషేధించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం యాష్‌పాంట్ లారీల ప్రవేశాన్ని నిషేధించాలంటూ సిపిఎం 16వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ సిపిఎం నగర్ నాయకులు ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలో ఇప్పటికే పలు మార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. కష్ణపట్నం పోర్టు నుంచి ట్యాంకర్లు హైవేపై వెళ్లకుండా చిల్డ్రన్స్ పార్క్ మీదుగా ముత్తుకూరు రోడ్డు సెంటర్ మీదుగా వెళుతున్నాయని, దీనివల్ల నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే 16వ డివిజనలోన్ ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు లారీలను అడ్డుకొని నిరసన తెలియజేశారన్నారు. గత వారం రోజుల క్రితం చిల్డ్రన్స్ పార్క్ దగ్గర సుధీర్ రెడ్డి అనే యువకుడిని యాష్ పాంట్ లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడన్నారు. సుధీర్ రెడ్డి కుటుంబాన్ని రూ. 25 లక్షలు ఇచ్చి వారి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. 17వ డివిజన్ శాఖ కార్యదర్శి కట్టా సతీష్ 18వ డివిజన్ శాఖ కార్యదర్శి జెకెపాణి, సంపూర్ణమ్మ, బాబు ,వెంకటేశ్వర్లు ,రఘు ,గోమతి పాల్గొన్నారు.

ఎపి జెన్కో చారిత్రాత్మక పోరాటం..!

రాష్ట్ర పభుత్వం జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి తూట్లు పొడుస్తోంది.. కొత్త పరిశ్రమలు రాకపోగ,. ఉన్న పరిశ్రమలను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారు. జిల్లాకు తలమానికంగా ఉన్న ఎపి జెన్కో సూపర్ క్రిటికల్ థర్మల్ ప్రాజెక్టును అమ్మకానికి పెట్టింది. థర్మల్ ప్రాజెక్టును ప్రయివేటీకరించొద్దని కార్మికులు చేస్తున్న పోరాటం 365 రోజులకు చేరింది. న్యాయమైన కోర్కెల సాధన కోసం ఇంత పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు, రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లు ఎపి జెన్‌కో పోరాటం ఏడాది అవుతోన్న సమయంలో ఆ ప్రాజెక్టును దక్కించుకోడానికి ప్రయత్నం చేస్తున్న కార్పొరేట్ శక్తులు ఒకడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి వేస్తుంది. టర్మస్ ఆఫ్ కండీషన్ విషయంలోనూ, కార్మికుల ఉద్యమం ఫలితంగా ప్రయివేటీకరణ ఆగిందనే చెప్పాలి. ప్రభుత్వం మాత్రం చాపకిందనీరులా పనిచేస్తుంది.

- ఏడాదిగా ఆందోళనలు
- ఒకడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కి
- ఊగిసలాటలో కార్పొరేట్ శక్తులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కృష్ణపట్నం (దామోదరం సంజీవయ్య థర్మల్ ప్రాజెక్టు) ఎపి జెన్‌కోను ప్రధాని నరేంద్ర మోడీ కోరిక మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మకానికి పెట్టారు. ఇప్పటికే ఆసియాలోనే అతిపెద్ద కృష్ణపట్నంపోర్టును ఆదానీకి అప్పగించారు. ఇది ఓ పథకం ప్రకారం జరిగిన కుట్రగా ప్రచారం సాగుతోంది. ఇది సరిపోదన్నట్లు ఇప్పుడు గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.21 వేల కోట్లతో 24వేల మెగావాల్ట్ అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సూపర్ క్రిటికల్ థర్మల్ ప్రాజెక్టును 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీరుతాయని చెప్పారు. 2015లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి ఎం.వెంకయ్య నాయుడు దీనికి సంబందించి 800 మెగావాల్ట్ చొప్పున రెండు యూనిట్లు ప్రారంభించారు. టిపి గూడూరు, ముత్తుకూరు ప్రాంతానికి చెందిన రైతుల నుంచి భూములు తీసు కున్నారు. ఈ ప్రాంతంలో 33 వేల ఎకరాల్లో, 33 వేల మెగావాల్ట్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులకు అనుమతులు వచ్చాయి. ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకుంటుందని తెలుసు. తమ ఆరోగ్యాలు క్షీణిస్తాయని అప్పటి సైన్స్ సంస్థలు హెచ్చరికలు జారీ చేశాయి. అయినప్పటికీ ఉపాధి, ఉద్యోగం ఇస్తామని, పునరావాసం కలిగిస్తామని, ప్రభుత్వం హామీ ఇచ్చింది. అప్పటి నుంచి ఈ ప్రాంతాల్లో ప్రాజెక్టులొచ్చినా స్థానికులకు ఉపాధి, ఉద్యోగం సరిగా దక్కలేదు. పునరావాసం ఊసేలేదు. 2015లో ఒక్కో యూనిట్ 800 మెగావాల్ట్ చొప్పున మూడు యూనిట్లకు శంకుస్థాపన చేశారు. 800 మెగావాల్ట్ సామర్థ్యంతో గతంలో రెండు యూనిట్లు ప్రారంభించారు. గతేడాది అక్టోబర్ 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 800 యూనిట్స్ , మూడో యూనిట్ ప్రారంభించారు. ప్రస్తుతం ప్రాజెక్టు బాగా పనిచేస్తుంది. నష్టాలు వస్తున్నాయని సాకుతో దీనిని ప్రయివేటీకరించడానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 1200 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు, 338 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బాగా పనిచేస్తున్న ప్రాజెక్టును గతేడాది జనవరి 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు 25ఏళ్ల లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం ప్రాజెక్టులో 27 శాతం వాటా తెలంగాణ ప్రభుత్వానిది. ప్రయివేటీకర ణను ఆ ప్రభుత్వం వ్యతిరేకిస్తుంది. గతేడాది అక్టోబర్ 20న బిడ్స్‌కు ఆహ్వానించారు. ముఖ్యమంత్రి అదే నెల 26న జిల్లాకు రావడంతో దానిని వాయిదా వేసుకున్నారు. అప్పటి నుంచి టెండర్ల ప్రక్రియ వాయిదా పడుతూ వస్తుంది. అదానీ కంపెనీ దీనిని దక్కించుకోడానికి ప్రయత్నాలు చేస్తుంది. టర్మస్ ఆఫ్ కండీషన్ కొలిక్కిరాకపోవడంతో ప్రక్రియ వాయిదా పడుతూ వస్తుంది. ఇదే సమయంలో ఏడాది నుంచి కార్మికులు ఆందోళనలు నిర్వహిస్తుండడంతో ఏం జరుగుతుందోననే కాస్త వేచి చూసే దోరణిలో ఉంది. ఇటీవల కాలంలో ఇంత సుదీర్ఘ పోరాటం జరగడం ఇదే ప్రథమం. ఈ ఉద్యమం విజయవంతం కావాలని జిల్లా ప్రజలు , కార్మికులు, రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

ఎపి జెన్‌కో వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు(ఫైల్)

365 రోజుకు చేరిన కార్మికుల ఆందోళనలు

ఎపి జెన్కో పరిరక్షణ కమిటీ పేరుతో కార్మికులు చేపట్టిన ఉద్యమం రేపటితో 365 రోజుకు చేరనుంది. గతేడాది జనవరి 21న ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులు ఆందోళన బాటపట్టారు. అప్పటి నుంచి ప్రతి రోజు ఏదొక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు, కార్మికులు రోజు తమ విధులు నిర్వహిస్తూనే, పోరాటం సాగిస్తున్నారు. ఒక్క వైసిపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు ఈ పోరాటానికి మద్దతుగా నిలిచాయి.. నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి, గ్రామాలు తరలించాలని, ఆరేళ్ల నుంచి ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పుడు ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఉద్యమం ఏడాది అయిన సందర్భంగా 21 అన్ని రాజకీయపార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేశారు. ఇక్కడ కార్మికులు నిర్వహిస్తున్న ఉద్యమం భవిష్యత్తు ఉద్యమాలకు ఆదర్శంగా కనిపిస్తోంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నెల్లూరు :రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలో రవాణా శాఖ ఉపరవాణా కమిషనర్ ఇన్‌ఛార్జి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు. గురువారం మినీబైపాస్ రోడ్డు సమీపంలోని రవాణా శాఖ కార్యాలయ ప్రాంతం నుంచి నిర్వహించిన ఈ ర్యాలీని నగర ట్రాఫిక్ డిఎస్‌పి అబ్దుల్ సుభాని జెండా ఊపి ప్రారంభించారు. ట్రాఫిక్ డిఎస్‌పి మాట్లాడుతూ హెల్మెట్ ధరించి దిచక్రవాహనం నడపటం సురక్షతమన్నారు. పలువురు డీలర్లకు సంబంధిత సిబ్బంది, మోటర్ బైక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమని నగర ట్రాఫిక్ సిఐ నాగేశ్వరమ్మ, సిఐ రమణా రెడ్డి ,ఆర్ఎస్ఐ చంద్రమౌళి పేర్కొన్నారు. ముత్తుకూరు బ్రిడ్జి వరకు నిర్వహించారు. ఉప రవాణా కమిషనర్ ఇన్‌ఛార్జి సుధాకర్ రెడ్డి, ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఇంచార్జ్ మురళీమోహన్, మోటార్ వాహన తనిఖీ అధికారులు కార్తీక్ పవన్, గోపి నాయక్, రాంబాబు, పూర్ణ చంద్ర రావు, స్వప్నిల్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

నెల్లూరు :విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఎపి ఈఆర్సి వారు విశాఖపట్నం నుంచి వర్చువల్ పద్ధతిలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు ప్రారంభోత్సవ ఉపన్యాసం చేశారు. విద్యుత్ భవన్ లోని స్కాడా లో ఏర్పాట్లు చేసిన వర్చువల్ వీడియో పద్ధతిలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ బి.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు. కావలి నుంచి ఎన్.శాంతి కుమార్ మాట్లాడారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ సోమ శేఖర్ రెడ్డి,బాల చంద్ర,జయకష్ణ రెడ్డి,పరంధామయ్య, మధు,రఘు ఉన్నారు.

కెవి రెడ్డి సేవలు మరువలేనివి..

నెల్లూరు :దివంగత మాజీ అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కెవి రెడ్డి సేవలు మరువలేనివని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణంలో కీర్తిశేషులు మాజీ అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కెవి రెడ్డి సంతాపసభ నిర్వహించారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రిటైర్డ్ వైద్య ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శి లు హరిబాబు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉద్యోగ సంఘాల జిల్లా నాయకులు రమణారెడ్డి, పెంచలరావ్, సుధాకర్ పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి

నెల్లూరు :చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని మహిళా రిజర్వేషన్ బిల్లు సాధన సమితి కన్వీనర్ కె.సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరు ప్రాంతంలో కె.సంజయ్ ఆధ్వర్యంలో మహిళ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభలలో మహిళలకు కనీసం 33శాతం రిజర్వేషన్ కల్పించకపోవడం వల్ల ఈ 75 సంవత్సరాలు మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులు స్పందించి రాబోయే బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కో కన్వీనర్ పి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి : ఎంపిపి

తోటపల్లిగూడూరు :వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిపి ఉప్పల స్వర్ణలత పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వస భ్య సమావేశం జరిగింది. ఎంపిడిఒ కన్నం హేమలత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్వర్ణలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. టిడిపి ఎంపిటిసి కొణతం రఘుబాబు మాట్లాడుతూ నరుకూరు పంచాయతీలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలన్నారు.అనంతరం యోగి వేమన జయంతిని పురాస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. జెడ్‌పిటిసి శేషమ్మ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని కొండసముద్రంలో టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్రంలో వైసిపి పాలన తీరుపై ప్రజలకు వివరించారు. గ్రామంలో పర్యటించే సమయంలో మన్నం సుబ్బారావు, నలమోతు పద్మ, తాటిపర్తి మాతమ్మ, తాటిపర్తి బసమ్మలు అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థిక ఇబ్బందులలో ఉన్నట్లు గుర్తించారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. సుబ్బారావు, పద్మకు రూ. పదివేలు చొప్పున, మరో ఇద్దరికి రూ.5వేలు వంతున ఆర్థిక సహాయం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరశింహం, గ్రామపార్టీ అధ్యక్షులు గట్టమనేని సుబ్బారావు, మాధవ, రాంబాబు, తెలుగు యువత అధ్యక్షులు శిఖామణి, నాయకులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని శింగమనేనిపల్లెలో సాగవుతున్న మిరప, శనగ పంట పొలాలను మండల వ్యవసాయాధికారి ఎం హేమంత్ భరత్‌కుమార్, ఉద్యానవన శాఖాధికారి పి బ్రహ్మాసాయి గురువారం పరిశీలించారు. మిరపలో రసం పీల్చే పురుగు నివారణకు పసుపు, నీలిరంగు జిగురు అట్టలు ఎకరానికి 20 ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. సిఫారసు చేసిన పురుగు మందులను వేపనూనెతో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. శనగ పంటలో సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. సహాయకులు వై ప్రభు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్యాల పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు :కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో యోగి వేమన జయంతి పురస్కరించుకుని విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం యం భాస్కర్ రావు విద్యార్థులతో కలిసి వేమన చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు.తరువాత పద్యాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులు హసీనా బేగం, లక్ష్మీసంజన లకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి, మాధవి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు :కొత్తూరు పంచాయతీ 31 వ డివిజన్ పరిధిలోని పాత అంబాపురం గిరిజన కాలనీలో ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు బుధవారం నాటికి ఐదో రోజు చేరుకున్నాయి. దాదాపు 60 కుటుంబాల గిరిజనులు పాల్గొన్నారు. ఆ ఐదు మందితో స్థానికమిటి ఏర్పాటు చేశారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షులు బహ్మయ్య పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త వేమన : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు : సమాజాన్ని చైతన్యపరిచిన యోగివేమన గొప్ప దార్శనికులు, సంఘ సంస్కర్త అని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిలుగా హాజరైన కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు ,సంయుక్త కలెక్టర్ రోనంకి కూర్మనాథ్‌తో కలిసి యోగి వేమన చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన గావించారు.కలెక్టర్ మాట్లాడుతూ యోగివేమన గొప్ప మహనీయులని, వారిని స్మరించుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. వారు తెలుగు జాతికి, తెలుగు భాషకు చేసిన ఎనలేని సేవలు స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. జిల్లా పర్యాటక సాంస్కృతిక అధికారి కనకదుర్గ భవాని డీఈవో వి ఎస్ సుబ్బారావు ఆర్ ఐ ఓ ప్రసాదరావు సర్వ శిక్ష ఏపీసి ఉషారాణి, జిల్లా రచయిత సంఘం అధ్యక్షులు జయప్రకాష్ పలువురు కవులు పాల్గొన్నారు.

రాపూరు : రాపూరు లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి మండల పరిషత్ అభివద్ధి అధికారి కె.ఆమోస్ బాబు , కార్యాలయ సిబ్బంది ఎంపీటీసీ సభ్యులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.మండల అధికారులు పాల్గొన్నారు.

అదాని కృష్ణపట్నం పోర్టులో

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

అదాని కష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. పోర్టు ఉద్యోగులు కార్మికులు వారి కుటుంబ సభ్యులతో ఆదాని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి వందలాదిమంది పాల్గొని సందడి చేశారు. తొలుత ఆదాని కష్ణపట్నం పోర్టు సిఇఒ జి జె రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాటకచేరి ఆటలు, పాటలతో ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు సందడి చేశారు .

సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న పోర్టు సిఇఒ జిజె రావు

సంక్రాంతి సంబరాలను ఉద్దేశించి పోర్టు సిఇఒ జిజేరావు మాట్లాడారు. ఉద్యోగులు కార్మికులు ఎప్పుడు పనే కాకుండా పండగలు సమయంలో వారి వారి కుటుంబ సభ్యులతో అందరూ ఒకే దగ్గర కలిసి సంక్రాంతి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాల కు అద్దం పట్టేలా ఈ సంక్రాంతి సంబరాలను నిర్వహిం చామన్నారు. ఈ సందర్భంగా పలుపోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను ఆదాని కష్ణపట్నం పోర్ట్ సీఈఓ జిజె రావు, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జి. వేణుగోపాల్, అడ్మిన్ హెడ్. గణేష్ శర్మ, ప్రధానం చేశారు. పోర్ట్ ఆపరేషన్స్ హెడ్ మోహిత్ శకావత్ హెచ్ ఆర్ డిజిఎం, సిహెచ్. శ్రీనివాస్, సి సి ఎం హెడ్, రామానంద్ యాదవ్, సెక్యూరిటీ హెడ్, వెంకటేష్ భాస్కరన్ ,మెరైన్ హెడ్ పాడియా టెక్నో కమర్షియల్ హెడ్ అశోక్ మిశ్ర, జయరాజ్ పిళ్లై, మీడియా మేనేజర్ బొనిగి శీనయ్య, పి శ్రీనివాసులు, రాజేష్ యాదవ్,తో పాటు వివిధ విభాగాల హెచ్వోడీలు, అడ్మిన్ హెచ్ఆర్ టీమ్, పాల్గొన్నారు.

రాజేష్‌పై శివరాం విమర్శలు సరికాదు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -కందుకూరు : ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ గురించి మాజీ శాసనసభ్యులు దివి శివరాం చేసిన వ్యాఖ్యలు సరికాదని పలువురు టిడిపి నాయకులు అభ్యంతరం తెలిపారు. స్థానిక ఇంటూరి రాజేష్ కార్యాలయంలో ఆయన వర్గీయులైన టిడిపి నాయకులు కొందరు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్‌టిఆర్ వర్ధంతిలో శివరాం మాట్లాడుతూ రాజేష్ కంపెనీ టిడిపి కార్యక్రమాలను డిస్టర్బ్ చేయటం మానుకోవాలని మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. రాజేష్ ఎక్కడ టిడిపి కార్యక్రమాలను డిస్టర్బ్ చేయడం లేదన్నారు. కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని సర్వనాశనం చేస్తుంది శివరామేనని విమర్శించారు.ఇటీవల శివరాం రాజేష్‌ను కలిసి 'మనిద్దరం ఒకటి అవుదాం.. నాగేశ్వరరావుని పక్కకు నేడదామని చెప్పారన్నారు. అందుకు రాజేష్ అంగీకరించకపోవడంతో కక్షతో అవమానకరంగా మాట్లాడుతున్నట్లు వారు ఆరోపించారు. శివరాం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికైనా శివరాం తన మాటలను వెనక్కు తీసుకోవాలన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఘట్టమనేని చెంచురామయ్య, కందుకూరు రూరల్ మండలం టిడిపి మాజీ అధ్యక్షులు పొడపాటి వంశీ, టిడిపి నాయకులు పొడపాటి శ్రీనివాసరావు, ఆవుల నరసింహారావు, బ్రహ్మయ్య , గంగవరపు బ్రహ్మయ్య, మనోజ్, వసంత మాట్లాడారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -కందుకూరు : జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఇవ్వాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ కార్యాలయంలో సిపిఐ పోరుబాట గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . ఈనెల 30 వరకు జగనన్న ఇల్ల నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పదో వార్డు శాఖ కార్యదర్శి ద్రోణాదుల ఆదినారాయణ, ఎఐటియూసి నాయకులు షేక్ హుస్సేన్, బాలబ్రహ్మాచారి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు చేవూరు దుర్గాప్రసాద్, రైతు సంఘ నాయకులు ఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -ఉలవపాడు :మండలంలోని అలగాయపాలెంలో ప్రకాశం జిల్లా అండర్ 17 స్కూల్ గేమ్స్ బాలుర జట్టుకు ప్రాథమికంగా ఎంపికైన క్రీడాకారులకు శిక్షణా శిబిరం గ్రామస్తులు గురువారం ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరం ఈ నెల 22వ తేది వరకు జరుగుతుందని తదనంతరం జిల్లా తుది జట్టును ఎంపిక చేసి కర్నూలులో ఈనెల 23వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు పంపుతామని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ సిహెచ్ సుబ్బారావు తెలిపారు. ఈ శిక్షణ శిబిరంకు ఇన్‌ఛార్జిగా కరేడు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఓగుబోయిన శ్రీనివాసులు, కోచ్‌లుగా వాయల బాబు, వాయిల నరేష్ వ్యవహరిస్తారని చెప్పారు. వాయల యానాది, ప్రళయ కావేరి సోమయ్య, వాయల రాములు, వాయల వెంకటేశ్వర్లు, వాయల వెంకటేశ్వర్లు, ఎంపిపి వాయల తిరుపతి, చాకిచర్ల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మినుములు కొనుగోలుకు చర్యలు : మానుగుంట

ప్రజాశక్తి -కందుకూరు :ఇటీవల వచ్చిన తుఫాను కారణంగా తడిసిన మినుములను కొను గోలు చేయించడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎంఎల్ఎల మానుగుంట మహీధర్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎఎంసి కార్యాలయంలో ధరల స్థిరీకరణ సమీక్ష సమావేశం గురువారం జరిగింది. మహీధర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో 3వేల క్వింటాళ్ల మినుము తడిసినట్లు సమాచారం ఉందన్నారు. వీటి కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. మినుములు విషయం మంత్రితో కూడా మాట్లాడామని దానిపై స్పష్టత కోసమే కందుకూరులో మార్కెడ్ ఏర్పాటు చేసే మినుముల కొనుగోలు కేంద్రాన్ని ఒకరోజు వాయిదా వేసినట్లు చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ ఎడిఎ ఎం. శేషగిరి, ఏవోలు, రైతులు పాల్గొన్నారు.

'ఇంటూరి' కృతజ్ఞతలు

ప్రజాశక్తి -కందుకూరు :పట్టణంలో బుధవారం ఎన్‌టిఆర్ వర్ధంతి విజయవంతంగా జరిగిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్ధంతి కార్యక్రమంలో 5వేల మంది పాల్గొన్నారు. 250 మంది రక్తదానం చేశారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి మహిళలు రక్తదానం చేశారన్నారు. మండల, గ్రామస్థాయిలో కూడా వర్ధంతి కార్యక్రమాలు జరిగాయన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన టిడిపి కార్యకర్తలు, నాయకులు అందరికీ ఆయన కతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరు రాజేష్ గురించి మాజీ ఎంఎల్ఎ దివి శివరాం మాట్లాడిన విషయాన్ని నాగేశ్వరరావును ప్రశ్నించగా ఏమి జరిగిందో తనకు తెలియదని తెలుసుకుంటానని చెప్పారు. టిడిపి తరపున జరుగుతున్న కార్యక్రమాలకు ఇంటర్ రాజేష్ వర్గీయులుగా ఉన్న వారిని ఆహ్వానించడం లేదని వారు ఆరోపిస్తున్న విషయాన్ని నాగేశ్వరరావుని అడగ్గా ప్రతి కార్యక్రమానికి తాము పిలుస్తున్నామని పట్టణ పార్టీ అధ్యక్షుడు అందుకు సాక్ష్యమన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు ధామల్లేశ్వరరావు, షేక్ రఫీ, ముచ్చు శ్రీను, ఎన్‌వి సుబ్బారావు, సవిడిబోయిన కృష్ణ, కూనం నరేంద్ర ఉన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

'రెడ్‌క్రాస్'కు భారీ విరాళం

నెల్లూరు :ప్రవాస భారతీయులు విన్నకోట లక్ష్మీ నరేంద్రబాబు రూ.10 లక్షల బ్యాంక్ చెక్కును కలెక్టర్ కెవిచక్రధర్‌బాబు చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు అందజేశారు. గురువారం కలెక్టరేట్ ఆవరణంలోని తిక్కన ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ సమాజ సేవలో తోడ్పడుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కి రూ.10 లక్షల విరాళం అందించడం అభినం దనీయమన్నారు. ప్రవాస భారతీయుడు విన్నకోట లక్ష్మీ నరేంద్రబాబు వారి తల్లిదండ్రులు విన్నకోట లక్ష్మీదేవి, శ్రీ విన్నకోట వెంకటేశ్వరరావుల స్మారకార్థం ఈ బ్యాంకు చెక్కును ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ ఆసుపత్రిలో ఒక గది నిర్మాణం కోసం వెచ్చించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ ఎండి జుబేర్, డాక్టర్లు నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి, ఐఆర్‌సి ఎస్ కమిటీ సభ్యులు రంగయ్య నాయుడు, విన్నకోట శివ, విన్నకోట నాగరాజు, నిమ్మల వెంకటేశ్వర్లు, జే.వి. సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మండలంలోని కొండసముద్రంలో నూతనంగా రామాలయం నిర్మిస్తున్నారు. తనవంతు సహకరించాలని గ్రామస్తులు కోరగా, స్పందించిన ఆయన రూ. 2 లక్షలు విరాళం ఆలయ ధర్మకర్త శంకర్‌కు గురువారం గ్రామంలో అందజేశారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆ గ్రామంలో జరిగింది. హాజరైన ఆయన అక్కడికక్కడే నగదును అందజేయడం జరిగింది. ఇంటూరి ఆదిశేషయ్య, నల్లమోతు రాంబాబు, మన్నం శ్రీనివాసరావు, గట్టమనేని మాధవరావు పాల్గొన్నారు.

కనుపూరు ప్రధాన కాలువ పనుల్లో

రూ. 30 కోట్ల అవినీతి

మంత్రి కాకాణిపై 'సోమిరెడ్డి' తీవ్ర అరోపణలు

ప్రజాశక్తి -పొదలకూరు :సర్వేపల్లి నియోజకవర్గం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతికి అడ్డాగా మారిందని మాజీ మంత్రి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. గురువారం సంగం బ్యారేజ్ సమీపంలో కనుపూరు ప్రధాన కాలువపై అధికారులు, కాంట్రాక్టర్లు చేసిన మరమ్మత్తు పనులను ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. 25 వాహనాల్లో నెల్లూరు నుంచి కాన్వాయ్‌గా వచ్చిన సోమిరెడ్డికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమిరెడ్డి కనుపూరు ప్రధాన కాలువపై 2 కి.మీ నడుచుకుంటూ వెళ్ళి పనుల తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ 45 నెలల్లో కనుపూరు ప్రధాన కాలువ మీద దోచుకున్న 30 కోట్ల ఇరిగేషన్ పనుల వివరాలు చెప్పే దమ్ము ,ధైర్యం కాకాణి ఉందా అని సూటిగా ప్రశ్నించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 60 కోట్ల మేర ఇరిగేషన్ , ఏప్డీఆర్ పనులు జరిగాయని ఆ పనులకు సంబంధించిన పనుల పేర్లు, పనుల విలువ, ఏ విధంగా బిల్లులు డ్రా చేశారో పూర్తి వివరాలను మంత్రి సర్వేపల్లి ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. సరైన సమాధానాలు చెప్పకుంటే పది రోజుల్లో జిల్లాలోని ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు ఆర్ రాధాకష్ణ నాయుడు, చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి, పొదలకూరు, తోటపల్లి గూడూరు, వెంకటాచలం, ముత్తుకూరు ,మనుబోలు మండల అధ్యక్షులు వరుసగా తలచీరు. మస్తాన్ బాబు, సురేష్ రెడ్డి, గుమ్మడి రాజా, రామ్మోహన్ రెడ్డి రామకష్ణారెడ్డి, బొద్దులూరు మల్లికార్జున నాయుడు బోగోలు భాస్కర్ రెడ్డి పులిపాటి వెంకట రత్నం నాయుడు,దేవినేని శరత్,అక్కెం. సుధాకర్ రెడ్డి, వెన్నపూస. రాజశేఖరరెడ్డి ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-ఉదయగిరి: మానసిక ఉల్లాసంతో పాటు గ్రామాల మధ్య స్నేహ సంబంధాలను క్రీడలు దోహదపడతాయని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని కాక్ర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాక్ర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వెంగళరావు నగర్ లో ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతులను అందజేయటకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్రాంతి సందర్భంగా మండల వ్యాప్తంగా 20 టీములు పాల్గొనగా ఫైనల్ కు ఉదయగిరి డేంజరస్ బాయ్స్ టీం, వెంగళరావు నగర్ యూత్ టీంలు విజేతలుగా నిలిచాయి. ఆసక్తికరంగా సాగిన మ్యాచ్ లో చివరికి ఉదయగిరి డేంజరస్ బాయ్స్ టీం మొదటి విజేతగా షేక్.ఖాజా నవాజ్ కెప్టెన్ గా కప్ ను కైవసం చేసుకొని మొదటి బహుమతి రూ.20,116 లను, వెంగళరావు నగర్ యూత్ టీం పిన్నిబోయిన ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరించి రన్నర్ గా నిలిచి రెండవ బహుమతి రూ.10,116 బహుమతులను ముఖ్య అతిథి కాక్ర్ల సురేష్ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుంటుపల్లి మాలకొండయ్య, వెంగప్రసాద్, బొద్దు వంశీ, నలి నరేంద్ర, పెద్ద ఎత్తున కబడ్డీ ప్రేమికులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న దృశ్యం

క్రీడల్లో యువత రాణించాలి

ఇందుకూరుపేట: చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల్లో యువత రాణించాలని కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రావూరు గ్రామంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహానంది సుబ్బరాయుడు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు నాగ ప్రతాప్, నాగ ప్రవీణ్, నాగ ప్రవీణ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రావూరు జట్టు 20116రూ, రెండవ బహుమతి 10116 రూ , మూడవ బహుమతి రావూరు, మైపాడు టీటీ జట్టు 5116 రూ అందుకున్నారు. బహుమతి ప్రదానం అనంతరం కోవూరు టిడిపి ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల వైపు మొగ్గుచూపి క్రీడల్లో రాణించాలన్నారు. తమ వంతు సహాయం ఎప్పుడూ నియోజకవర్గ యువతకి ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి, చెంచు కిషోర్ బాబు, ముంగర గోపాల్, బాల బొమ్మ వెంకటేశ్వర్లు, కొండూరు సుధాకర్ రెడ్డి, చేముకుల కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి విరువూరు సచివాలయాలను వరికుంటపాడు తహశీల్దార్ అబ్దుల్ హమీద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదిరెడ్డిపల్లి సచివాలయాన్ని సందర్శించిన ఆయన సచివాలయంలోని హాజరు రిజిస్టర్ విజిటర్ రిజిస్టర్ మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేసిన ఆయన బయోమెట్రిక్ హాజరు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పెదిరెడ్డిపల్లి గ్రామంలోని ఒకరికి చెందిన రెవెన్యూ భూమి సమస్యను సంబంధిత వ్యక్తులతో మాట్లాడి రికార్డు పరంగా ఉన్న సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా ఫైల్ తయారు చేయవలసిందిగా వీఆర్వోను ఆదేశించారు. మండల ఆఫీసు చుట్టూ తిరుగుతూ పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్న తమకు సచివాలయానికి వచ్చి తమ భూ సమస్యను విచారించి న్యాయం చేస్తున్న తహశీల్దార్ కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భూ సమస్యపై ఫీల్డ్ కు వెళ్లిన తహశీల్దార్ వర్తించిన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయన వెంట వీఆర్వో కొండయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న తహశీల్దార్

పొంచి ఉన్న ప్రమాదం.. భయాందోళనలో రైతులు

ప్రజాశక్తి-విడవలూరు: మండల పరిధిలోని ఊటుకూరుకు వెళ్లే మార్గంలో సినిమా హాల్ పక్కన ఉన్న సబ్ స్టేషన్ పక్కన పొలాల్లో మూడు ఫేసులు కలిగిన విద్యుత్ స్తంభం నేలకు ఒంగి పొలాలను తాగుతుంది.దీంతో రైతులు భయాందోళనలో ఉన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరు ఎక్కినట్లు వ్యవహరిస్తున్నారు. అసలే సముద్రానికి దగ్గరగా ఉన్న పరిసర ప్రాంతాలలో అధికంగా మంచు కురిసి చల్లటి గాలులు వీయడంతో చలి తీవ్రత మరింత అధికమై తెల్లవారుజామున రైతులు పొలాల్లో మోటర్లు వేసేందుకు వెళుతున్నప్పుడు పచ్చటి పొలాల మధ్యలో నేల తాగుతున్న కరెంటు వైర్లు తాకిడికి భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇకనైనా కరెంటు అధికారులు స్పందించి కరెంటు స్తంభాలను మరమ్మతులు చేయాలని ఆప్రాంత రైతులు కోరుతున్నారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-అల్లూరు: ప్రతి వ్యవసాయ రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కావలి ఎడిఎ కన్నయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో విఎఒలతో విస్తత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో వ్యవసాయ రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు రైతులకు వర్తిస్తాయని తెలియజేశారు. అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో పాస్‌బుక్, 1బి, ఆధార్ కార్డు తీసుకువెళ్లి పంట నమోదు చేసుకోవాలని వివరించారు. ఎరువులు తదితర సమస్యలపై కూలం కుషంగా చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు తదితరులున్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-విడవలూరు: మండల పరిధిలోని ఊటుకూరు పెద్దపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గురువారం కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డికి గ్రామస్తులు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులతో మమేకమవుతూ వారు పొందిన ప్రభుత్వ పథకాలను తెలిపే బుక్లెట్ ను అందజేశారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రసన్న

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీ రామారావు ఏ వేషం వేసినా ప్రజలు ఆయనను దేవుడుగా కొలిచేవారని తెలిపారు. తొమ్మిది నెలల కాలంలోనే అధికారం ఎక్కించుకున్న మహానుభావుడని అయితే అటువంటి దేవుడిని నారా చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచారన్నారు.కార్యక్రమంలో రామిరెడ్డి విజయ భాను రెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణ రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, నవీన్ రెడ్డి, అచ్యుత్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం ఏనుగుల భాయి పంచాయతీలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాల్గొని గ్రామ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు .ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు, గ్రామస్తులు, నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ప్రజాశక్తి-కావలి: కావలి రూరల్ మండల పరిధిలో జరుగుతోన్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను ఆర్‌డిఒ కావలి శీనా నాయక్ గురువారం సుడిగాలి పర్యటన చేసి,పరిశీలించారు. మండల పరిధిలో గౌరవరం,రుద్రకోట,ఆనెమడుగు లేఅవుట్లలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను స్వయంగా తనిఖీ చేశారు. ఉగాదినాటికి ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసి, గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికా రులను ఆదేశించారు.ఎక్కడ ఎటువంటి అలసత్వానికితావు లేకుండా పనిచేయాలని అధికా రులను ఆదేశించారు. ఇంటి నిర్మాణ పనులకు సంబంధించి సిమెంటు స్టీలు ఇసుక కంకర సరఫరా చేయాలని సంబంధిత హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎక్కడ నాణ్యత లోపించకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. లబ్ధిదారులు అధికారులకు సహకరించి, వెంటనే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశాలుచేయించాలని కోరారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి రమేష్ నాయక్,ఎంపీడీవో వెంకటసుబ్బారావు తహశీల్దార్ మాధవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వరప్రసాద్, హౌసింగ్ ఎఇ నరేంద్ర, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ శీనా నాయక్

కబ్జాలో గిరిజనుల మండపం..!

..నిర్లక్ష్యంగా ఐటిడిఎ అధికారులు
..20 ఏళ్ల నుంచి గోదాముగా ఉన్న వైనం

ప్రజాశక్తి-అల్లూరు

అల్లూరు నగర పంచాయతీలో కూత వేటుకు దగ్గరగా ఉన్న రామాపురం గిరిజన కాలనీలో ప్రభుత్వ సొమ్ముతో కళ్యాణ మండపాన్ని సుమారు 20 ఏళ్ల నాడు ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఓ వ్యక్తి కబంధ హస్తాలలో ఈ కళ్యాణ మండపం కబ్జాకు గురైంది. ఇందులో ప్రతేడాది ధాన్యాన్ని నిల్వ చేసుకొని దర్జాగా అనుభవిస్తు తన సొత్తు అంటూ వ్యవహరిస్తున్నాడు. కళ్ల ముందే ఇంత అన్యాయం జరుగుతుంటే గిరిజనులు ఏమీ చేయరని నిస్సాహాయస్థితిలో ఉండిపోయారు. తమగోడు ఐటీడీఏ అధికారులకు వెళ్లబోసుకొని ఫిర్యాదు చేసినా నిర్లక్ష్య ధోరణతో వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నించినా ఎక్కడైనా నోరు మెదిపితే అధికారులు ఆ వ్యక్తికి సమాచారమిచ్చి మా పై దాడులకు ఉసిగొలుపుతున్నారని తెలిపారు. బహిరంగంగా మాపై దాడులు చేయడమే కాక గ్రామం నుంచి వెళ్లగొడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మాకు న్యాయం చేసే నాథుడే కరువయ్యారని తెలియజేశారు. కళ్ల ముందే ఇంత అన్యాయం జరుగుతుంటే పాలకులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని వారన్నారు. మా గ్రామానికి వచ్చే ప్రతి రాజకీయ నాయకుడు సూక్తులు వెల్లడించి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం మీకే నంటూ మాటల గారడి తప్ప ఇంకేమీ లేదన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లల్లోకి నీరు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వారన్నారు. వయో వద్ధులు, చంటి పిల్లలు తలదాచుకునేందుకు కళ్ల ముందే పెద్ద బిల్డింగు ఉన్న అక్కరకు రాకుండా పోయిందని విచార వ్యక్తపరిచారు. మా కోసం నిర్మించిన కళ్యాణ మండపంలో మా జాతి ప్రజలు ఒక్క వివాహం కూడా చేసుకోలేదని బోరున విలపించారు. కబ్జా చేసిన వ్యక్తిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి మాకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇంతవరకు ఐటీడీఏ అధికారులు ఈ గ్రామానికి వచ్చి మా సమస్యను పరిష్కరించకపోవడం చాలా దారుణమని వ్యాఖ్యా నించారు. ఇకనైనా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి సమస్య ను వెంటనే పరిష్కరించాలని ఆ గ్రామస్తులు వివరించారు.

కబ్జాకు గురైన మండపం

పలుచోట్ల 'వేమన' జయంతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వేమన మానవతావాది అని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు పుల్లయ్య, తెలుగు భాషో పాధ్యాయులు డాక్టర్. ఎం. ప్రసాద్ పేర్కొన్నారు. గురు వారం వేమన జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉదయగిరి

యోగి వేమన జయంతిని మండల పరిషత్ కార్యాలయం లో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించారు. సిబ్బందితో కలిసి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులు అర్పించారు.కార్యక్ర మంలో ఇఒపి ఆర్‌డి మల్లికార్జున, ఎపిఒ శ్రీనివాసులు, ఎఒ రేణుక, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం

మహాకవి యోగివేమన ప్రజాకవి గొప్ప తాత్వికవేత్త అని ఎంఇఒ మస్తాన్ వలీ తెలిపారు. గురువారం యోగివేమన జయంతి వేడుకలు కోటవీధిలోని ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహాకవి యోగివేమన చిత్రపటానికి నివాళులర్పించారు. అనం తరం ఎంఈఓ మస్తాన్ వలి మాట్లాడుతూ యోగివేమన జయంతి వేడుకలు ప్రతేడాది జనవరి 19వ తేదీన అధికారికంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యా యుడు రామకష్ణంరాజు, ఉపాధ్యా యులు కలివెల రవిచంద్ర దేవరాజ్ పాల్గొన్నారు.

అల్లూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ కుమారి దర్శగుంట శశిరేఖ మాట్లా డారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పెంచల వీరేంద్ర, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పురంలో నివాళులర్పిస్తున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

ఎఎస్‌పేట

మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, సచివాలయాల్లో, పాఠశాలల్లో సంఘ సంస్కర్త యోగివేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎంపీడీఓ ఎం భాస్కర్ ఆధ్వర్యంలో యోగివేమన చిత్రప టానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రిన్సిపల్ బి. లక్ష్మమ్మ, ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగివేమన పద్యాలను, ఆయన జీవిత చరిత్రను బోధించారు. ఈనెల24న నిర్వహించే జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు, వ్యాసరచన, వక్తత్వ, పోటీలు నిర్వహించారు.

ఇందుకూరుపేట

స్థానిక మండల పరిషత్ అధికారులు యోగివేమన జయంతిని ఘనంగా జరుపుకున్నారు.గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వేమన కవితా సాహిత్యాన్ని గుర్తు చేశారు.కార్యక్రమంలో ఎంపిడిఒ కల్పన, ఇఒపిఆర్‌డి డి.వసుంధర, ఆఫీసు సూపరింటెండెంట్ ఉషారాణి, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విడవలూరు

మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం యోగి వేమన జయంతి కార్యక్రమం తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. తొలుత యోగి వేమన చిత్ర పటానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహశీల్దారు కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: నిబంధనలు పాటిస్తూ డ్రైవర్లు డ్రైవింగ్ చేయాలని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాలపై ప్రయివేట్ స్కూల్లో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాములు , ఎస్సై రాజేష్ లు , మాట్లాడుతూ డ్రైవర్లు రహదారి నిబంధనలు తెలుసుకొని పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు వీలు పడుతుందన్నారు. ద్విచక్ర వాహనాల దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రయివేటు డ్రైవర్లు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి-కావలి: కేవలం మానవ తప్పిదాల వలన మాత్రమే 80 శాతం రహదారి ప్రమాదాలు సంభవిస్తున్నాయని కావలిసబ్ డివిజన్ పోలీస్ అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం కావలి ఆర్‌టిసి గ్యారేజ్ ఆవరణలో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను అయన ఘనంగా ప్రారంభించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు, రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులు, కార్మికులు, టాక్సీ, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కావలి సబ్ డివిజన్ పోలీస్ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ అప్రమత్తంగా డ్రైవింగ్ చేస్తేతమ వాహనంతో పాటు ఎదుటి వాహనదారులు, పాదచారులు క్షేమంగా ఉంటారన్నారు. సభకు అధ్యక్షత వహించిన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు మాట్లాడుతూ మానవ తప్పిదాల వలన 80శాతం రోడ్డు ప్రమాదాలు జరిగితే, వాహన లేదా రోడ్డు కండిషన్ సరిగా లేకపోవడం వలన వాతావరణ పరిస్థితుల కారణంగా మిగతా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని, వాహనం స్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, పొగమంచు, వర్షం ఉన్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగి డ్రైవింగ్ చేయకూడదని పేర్కొన్నారు.కార్యక్రమంలో కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, కావలి 1వ పట్టణ, రూరల్, కలిగిరి సిఐలు శ్రీనివాసరావు, రాజేష్, సాంబశివరావులు మాట్లాడారు.రవాణాధికారి కరుణాకర్, ఆర్టీసీ గ్యారేజ్ ఇన్‌చార్జి ఖాజామొహిద్దీన్, సబ్ డివిజన్లోని పలువురు సబ్ ఇన్స్పెక్టర్లు, బస్సు, టాక్సీ, ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ గ్యారేజ్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి

తాగునీరు అందించండి మహాప్రభో..!

ప్రజాశక్తి-కొండాపురం: మండలంలోని సత్య వోలు పంచాయతీ లింగన్నపాలెంలో పది రోజులుగా తాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఈ పంచాయతీకి జల శ్రీ పథకం కింద 30 లక్షలు రూపాయలతో పైపులైన్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఐదు నెలలు గడిచిన ఇప్పటివరకు చుక్క నీరు ఇచ్చిన పరిస్థితి లేదు. గ్రామంలో పశువులు, ప్రజలకు నీళ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. లింగన్నపాలెంలో చేతి బోరు లేకపోవడం విశేషం. ఎక్కడో ఒకటి రెండు బోర్లను సొంతంగా ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న వారి దగ్గరికి వెళ్లి ఇక్కడ ప్రజలు నీళ్లు తెచ్చుకుంటున్నామని అంటున్నారు. అవి కూడా సక్రమంగా రావడం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై గ్రామ ప్రజలు తెలుగు యువత మాజీ ప్రధాన కార్యదర్శి మందపల్లి మాధవరావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పది రోజులుగా నీళ్లు లేక నానా అవస్థలు పడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శిని అడిగితే సర్పంచ్ ని అడగమంటున్నారని సర్పంచ్ ని అడిగితే కార్యదర్శిని అడగమంటున్నారని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా పంచాయతీకి సంబంధించిన వార్డు మెంబర్లు సంతకాలు తీర్మానాలలో పెట్టడం లేదని పనిచేయాలంటే వీలుకావడం లేదని పంచాయతీ సర్పంచ్ అన్నారని ఆయన అంటున్నారు. ఈ విషయంపై ఉన్నత అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామానికి తాగునీరు సమస్య పరిష్కరించాలన్నారు. లేదంటే సోమవారం కలెక్టర్ ను కలిసి తమ గోడును వినిపించు కుంటామని తెలిపారు.

రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-సీతారామపురం: మండలంలోని 14 పంచాయతీలలోని హౌసింగ్ కాలనీలలో పట్టాలు తీసుకున్న 637 మంది లబ్ధిదారుల వివరాలు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ ప్రక్రి యను త్వరగా పూర్తిచేయాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాల యంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించి రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పిఆర్ ఎఇ శ్రీనివాసరాజు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్న రాయుడు, ఇంజినీరింగ్ అసెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

మాట్లాడుతున్న మాలేపాటి

కావలిలో ఇంటింటికి టిడిపి

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానా యుడు ఆధ్వర్యంలో ప్రతిష్టా త్మకంగా చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం 2వ రోజన పట్టణం లోని1వ వార్డు మద్దూరుపాడులో కొనసాగిం చారు. "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ తిరుగుతూ కరపత్రాల ను పంపిణీ చేస్తూ వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరిస్తూ, చిన్నారులకు చాక్లెట్లు పంచుతూ... మాలేపాటి హల్చల్ చేశారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ హయాం లోనే మద్దురుపాడులో రోడ్లు గాని,లైట్లు గాని నిర్మించామన్నారు. వైసీపీ ప్రభు త్వం వచ్చాక రోడ్ల నిర్మాణానికి తట్ట మట్టి వేసిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. రాష్ట్రం అభివద్ధి పథంలో నడవా లంటే తెలుగుదేశం పార్టీఅధి కారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పోతు గంటిఅలేఖ్య, మన్నవ రవిచంద్ర, కొండా వెంకట్రావు, కొమరా వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, పోతు గంటి శ్రీకాంత్, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి

కావలి ఆర్.డి.ఒ. శీనా నాయక్‌ని వికలాం గుల నాయకులు ఆర్.డి.ఓ. కార్యాలయంలో కలిసి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వినతి పత్రం అంద జేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కావలిలో చెవుడు ,మూగ డాక్టర్లు లేరు కనుక సదరం సర్టిఫికెట్‌కు నెల్లూరుకు పోవలసి వస్తుందన్నారు. సంబంధిం చిన డాక్టర్లను కావలిలో వికలాంగులకు అందుబాటులోఉండే విధంగా వేయించమని అడిగారు. ఇళ్ల స్థలాల కోసం ఆన్లైన్ చేసి 100 రోజులు కావస్తున్నా ఇంతవరకు ఏమి లేనందున త్వరగా దీనిపై దష్టి పెట్టి, అందరికి ఇల్లు, స్థలాలు ఇచ్చే విధంగా చేయాలని కోరారు. బ్యాటరీ బండ్లు, ట్రై సైకిల్, లేక చాలా మంది బాధపడు తున్నారన్నారు.కనుక ఒక క్యాంపు ఏర్పాటు చేసి,వికలాంగులకు సహాయం చేయమని కోరారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతన్న నాయకులు

అభివృద్ధి కావాలి-దోపిడీ పోవాలి

ప్రజాశక్తి-కావలి

స్థానిక, సిపిఎం ఆఫీసులో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం లో "అభివద్ధి కావాలి – దోపిడీ పోవాలి" –" సేవ్ కావలి" నినాదంతో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక ఏర్పాటు జరిగింది.ఈ వేదికకు కన్వీనర్‌గా న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కరవది భాస్కర్, సభ్యులుగా పి. పెంచలయ్య (సిపిఎం) కె. నాగ రాజు(సిపిఐ), చింతాల వెంకట్రావు (కాంగ్రెస్), జ్యోతిబాబురావు (టీడీపీ), లక్ష్మీ రెడ్డి (సిపిఐఎంఎల్), జి. నాగార్జున (జనసేన) ఏసురత్నం (ఎం.ఎస్. పి), పెంచల నరసింహ (డ్రైఫీ), కష్ణ మోహన్ (సీఐటీయూ), హఫీజ్ (ముస్లిం మైనార్టీ), ప్రవీణ్ (జన చైతన్య వేదిక), దేవకుమార్, కత్తి శివయ్య, లు ఉన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కావలి నియోజక వర్గంలో అభివద్ధి భూతద్దం పెట్టి వెతికినా కానరాదన్నారు.ప్రజాప్రతినిధిగా అధికారంలో కొనసాగుతున్న ఎం.ఎల్. ఏ నియోజక వర్గం అభివద్ధి చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. కేవలం దోపిడీలో మాత్రమే సపలం అయ్యాడని అన్నారు. పట్టణానికి తాగు నీరుకు చెందిన అమత పథకం గత ప్రభుత్వంలో 80 శాతం పనులు పూర్తయినా మిగతా పనులు పూర్తి చేయలేకపోయారని అన్నారు. పట్టణంలో 10కి పైగా మురికి వాడలు ఉన్నాయని, వాటికీ 12శాతం నిధులు కేటాయించాలని ఉన్నా కూడా అమలు చేయ లేని దుస్థితిలో మున్సిపల్ అధికారులు, కావలి ఎం.ఎల్.ఎ ఉన్నాడని అన్నారు. దగదర్తి ఎయిర్ పోర్ట్ తరలి పోవడం, తుమ్మల పెంట రోడ్డు, బట్లదిన్నె రోడ్డు, వేయలే కపోవడం, పెద్ద పవని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మా ణం చేయలేకపోవడం, ట్రంకు రోడ్డు విస్తరణ పనులు ఆగి పోవడం ఎం. ఎల్. ఏ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.కావలి మున్సిపాల్టీకి పాలక వర్గం లేకుండా చేసి మున్సిపల్ కమిషనర్, ఎం.ఎల్.ఏ.లు ఇద్దరు నీకెంత? నాకెంత? పద్ధతిలో దోపిడీ చేస్తున్నారని అన్నారు. మట్టి అక్రమ తవ్వకాలు, అక్రమలేఅవుట్లు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలు తప్ప అభి వద్ధి లేదన్నారు. అభివద్ధి కోసం, దోపిడీకి వ్యతి రేకంగా జరిగే పోరాటంలో ప్రజలు, ప్రజాస్వామిక, వాదులు, మేధావులు కలసి రావాలని, పిలుపునిచ్చారు.

బ్యాంకు సేవలకు అంతరాయం.. అవస్థల్లో ఖాతాదారులు

ప్రజాశక్తి-వరికుంటపాడు

బ్యాంకు సేవలో ఖాతాదారులకు సరైన రీతులో చేరడం లేదని ప్రజలు వాపోయారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ రవి రెడ్డిని సంప్రదించగా బ్యాంకు వెనుక భాగాన ఉన్న ఇంటర్నెట్ టవర్లో సాంకేతిక లోపం ఏర్పడిందని అధికారులు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యను అధిగమిస్తామని తెలిపారు. ఏదేమైనా మూడు రోజులుగా బ్యాంకు సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో ఖాతాదారులు డబ్బు డ్రా చేసుకోవడానికి డబ్బు ఎవరికైనా పంపాలన్నా సాంకేతిక సమస్యల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు రోజులైనా ఇప్పటివరకు అధికారులు పట్టించుకోలేదని వాపోయారు.

క్రైం కార్నర్

చెట్టును ఢీకొన్న కారు

ఒకరు దుర్మరణం,మరొకరికి గాయాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

అదుపు తప్పి కారు చెట్టును ఢీకొంది. దీంతో కారు లోయలో పడి ఒకరు దుర్మరణం చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈసంఘటన మండలంలోని జడ దేవి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. గుంటూరు నుంచి ఉదయగిరికి ఇద్దరు వ్యక్తులు కారులో ప్రయాణం చేస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్ల కారు చెట్టుకి ఢీకొనడంతో రోడ్ వైపు లోయలో పడిపోయింది. డ్రైవర్ పక్కన పవన్ ప్రసాద్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. డ్రైవరు సీటు బెల్టు పెట్టుకోవడం వల్ల బెలూన్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదాన్ని తెలుసుకున్న ఎస్ఐ బాలమహేందర్ నాయక్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మతి చెందిన వ్యక్తిని జెసిబి సహాయంతో బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కొడవలూరు

ఆటో, మోటార్ బైక్‌ను ఢీకొనగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని రామాపురం వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు..బుచ్చిరెడ్డిపాలెం నుంచి రమేష్ మోటార్ బైక్‌పై నార్తురాజుపాలెం వైపు వస్తున్నారు. నార్తురాజుపాలెం నుంచి వ్యవసాయ కూలీలతో ఆటో బుచ్చిరెడ్డిపాలెం కొట్టాలు ప్రాంతానికి వెళుతోంది. రామాపురం వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటార్ బైక్‌పై వస్తున్న రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీ నారయ్య(80) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 కి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ ఇద్దరికీ ప్రాథమిక చికిత్స చేసి నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ నారయ్య(60) పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు 108 సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం అందాల్సి ఉంది.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని నార్త్ రాజుపాలెంలో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో గురువారం యోగ, ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం జరిగినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి కుమార్ బాబు తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ టి వి ఎస్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి యోగా సాధన చేయడం వల్ల జీవన విధానం ఉత్సాహంగా ఉండటంతో పాటు చదివిన అంశాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని తెలిపారు.కళాశాల చైర్మన్ డాక్టర్ పెనుబల్లి బాబు నాయుడు, డైరెక్టర్ జ్యోతి చంద్రమౌళి, కష్ణ చైతన్య కళాశాల తరపున ముఖ్య అతిథికి ధన్యవాదాలు తెలిపారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-ఉదయగిరి

ముఖ్యమంత్రి నిర్ణయం పై వైసిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని వింజమూరుకు నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు ధనుంజయరెడ్డిని నియోజకవర్గ వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్ణయం పై హర్షం వ్యక్తం చేశారు. కార్యకర్తల సమావేశంకు పాల్గొన్న ధనుంజయ రెడ్డి ను కలిసిన వైసిపి నాయకులు స్థానిక సమస్యలు వివరించగా కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో సంప్రదించి సమస్యలను పరిష్కరించారు. ప్రతి ఒక్కరూ కలిసి జగన్మోహన్ రెడ్డి గెలుపునకు కషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నియోజ కవర్గ వైసిపి జెడ్‌పిటిసి జి.బాలకష్ణారెడ్డి, యువజన ప్రధాన కార్యదర్శి కల్లూరి రాజారెడ్డి పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం, విశ్వనాథరావుపేట పంచాయతీలోని బిట్ 2, బిట్ 3, రామస్వామి పాలెం బిట్ 2, అంగన్‌వాడీ కేంద్రాలలో అలిమడుగు గ్రామ సచివాలయం కడనుతల గ్రామంలో గురువారం బాలికల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల మాట్లాడుతూ జనవరి 24న బాలికల దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 18 తేదీ నుంచి 24 వ తారీకు వరకు గ్రామాలలో గ్రామ సభలను సచివాలయ పోలీస్ సిబ్బందితో నిర్వహించాలన్నారు. కొత్తగా పెళ్లయిన జంటలను బాలింతలుగా ఉన్న వారిని కలిసి ఆడపిల్లల పట్ల నిర్లక్ష్యం, లింగ నిష్పత్తి తక్కువ గల కారణాలు ఆడపిల్లల మనుగడ వారి రక్షణకు తగిన భరోసా, ఆడపిల్లల విద్య, ఆర్థిక శ్రేయస్సు పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పి.నరేష్ ను పలువురు ప్రజా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సన్మానించారు. అభినందన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సమస్యను చట్టపరంగా పరిష్కరించుకుంటామని తెలిపారు. సర్పంచ్ షేక్ జిలాని బాషా, మాజీ ఎంపిటీసీ షేక్ షబ్బీర్ బాషా, జిల్లా వక్ఫ్ బోర్డ్ వైస్ చైర్మన్ షేక్ షౌకత్ అలీ, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సందాని బాషా, మండల పంచాయతీ అధికారి తదితరులు ఉన్నారు.